

# మనసుకాక పండుగ

కె. కె. భాగ్యశ్రీ

అవి ధనుర్మాసపు తొలిరోజులు. చిన్నగా చలి మొదలైంది సాయం సంధ్యవేళలోనే. చిరుచీకట్లు అలముకుంటున్నాయి అప్పుడే.

వీధి గుమ్మంలో కూర్చున్న అనంతమ్మ అలా రోడ్డుకేసి చూస్తోంది. జనమంతా హడావుడిగా పరుగులు తీస్తున్నారు. అంతా యాంత్రికం. ఎక్కడా పండుగ హడావుడి కానరాలేదు.

రాబోయే జనవరి నెలకోసం ఆతృతగా, ఆశగా ఎదురుచూస్తోంది అనంతమ్మ అంతరంగం. కారణం- వచ్చేవి సంక్రాంతి పండగ రోజులు.

''ఇంకా కృష్ణుడి దగ్గర నుండి ఉత్తరం రాలేదు...'' అనుకుంది ఆమె.

తిరిగి తన పల్లెకు చేరుకొని, పూర్వవైభవంతో పండుగ జరుపుకోవాలన్నది ఆమె ఆంతర్యం.

భోగిమంటల వెలుగులో, సంక్రాంతి లక్ష్మి తాండవించిన తన పల్లె అందాలను మళ్లీ చూడాలని ఆమె మనసు తహతహలాడ్తోంది.

''ఏమో.. ఈసారయినా తన ఊరికి వెళ్లగలుగుతుందో లేదో పండుగనాటికి!'' సంశయంగా అనుకుంది అనంతమ్మ.

''ఇంటినిండా మనుషులతో, కళకళలాడుతూ పండుగ జరుపుకొని అప్పుడే రెండేళ్లయిపోయింది. ఆ మారాజు ఉంటే ఎంత బాగుండేదో.. 'అక్కతోటే వెళ్లాయి శుక్రవారాలు' అన్నట్లు ఆయనతోనే పోయింది వైభోగం అంతా'' అనుకుంది చెమర్చిన కన్నులతో.

అనంతమ్మకు అరవై ఏళ్లుంటాయి. పచ్చని ఛాయతో, నుదుట నయాపైసంత కుంకుమ బొట్టుతో, లక్ష్మీదేవిలా కళకళలాడే ఆమె వదనం, కళావిహీనమై, వెలవెలబోయి రెండేళ్లపైనే అయ్యింది.

పొలానికని వెళ్తూ, దారిలో పాముకరచి మరణించారు ఆమె భర్త సుందర్రావుగారు. అప్పట్నుంచీ అనంతమ్మ ఎండిన మోడులా బ్రతుకుతోంది.

బలరామకృష్ణులు, సుభద్ర ఆమె సంతానం.

మగబిడ్డలిద్దరి తరువాత ఎన్నాళ్లకో, దాదాపు కానుపు ఎత్తికట్టే సమయంలో పుట్టింది సుభద్ర.

సుందర్రావుగారున్నన్నాళ్లూ ఆ ఇల్లు సకలైశ్వర్యాలతో కళకళలాడేది. అనంతమ్మ మహారాణిలా అన్ని సుఖాలు అనుభవించింది. నిత్యం ఇంటినిండా పాడి పంటలతో, సిరులతో తులతూగుతూ ఉండేది వారి లోగిలి.

పండగంటే మాటలా... పంటలు బాగా పండిన ఆనందంతో కన్నుల వేడుకగా జరిగేది. గాదెల నిండిన ధాన్యరాశులతో, ముంగిట రంగవల్లులతో వాటిమధ్య గొబ్బెమ్మలతో.. గంగిరెద్దువాళ్ల సన్నాయి వాద్యాలతో.. హరిదాసు సంకీర్తనలతో.. తమ ఊరు కళకళలాడేది.

తెల్లవారితే భోగి అనగా తమ ఇంటి వెనుక పెరట్లో పాలెగాళ్లంతా కలసి పెద్ద భోగిమంట వేశేవారు.

భోగిమంట కోసం ఊర్లోని చిన్న పిల్లలందరూ కలసి డబ్బులు, కిరసనాయిలు, కర్ర, కంప దండుకోవడం కోసం 'భోగిమంట.. పొయ్యిలోకర్ర.. ఇచ్చినమ్మది పుణ్యాం.. ఇవ్వనమ్మది పాపం..' అని పాడుతూ ఊరంతా తిరిగి అన్నీ పోగుచేసేవారు.

చిన్నతనం నుండీ బలరాముడు, కృష్ణుడు కూడా అలాగే కలపంతా సేకరించేవారు. అన్నదమ్ములతో కలసి చిట్టి చిట్టి అడుగులు వేస్తూ సుభద్ర కూడా తన చిన్ని హస్తాలతో పిడకలు, చిన్నపుల్లలు మంటలోవేసేది.

ఆయన పోయేంతవరకూ కూడా అదే అలవాటుగా భోగిమంటవేసి.. ఇంట్లో చిన్న పిల్లలుంటే వాళ్లకి భోగి పళ్లు పోయడం.. పేరంటం చేయడం చేసేది తను.

సుభద్ర చిన్నతనం అన్నాళ్లూ ఆమెకి పోసేది భోగి పళ్లు.. ఆమె పెద్దదయ్యాక కృష్ణుడి పిల్లలకు పోసేది. బలరాముడి పిల్లలు ఎప్పుడూ ఇక్కడికి వచ్చి ఎరగరు. పెద్దకోడలు రమ వాళ్లను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయేది.

ఇంక సంక్రాంతి రోజు.. ఆ సంబరం చూడాలేగాని మాటల్తో వర్ణించలేము. రంగురంగుల ముగ్గుల్తో మొదలైన సంక్రాంతి, తమ జీవితాలకు క్రొత్త కాంతినిచ్చేది. పెద్దలకు తర్పణం వదలడం.. కొత్త బియ్యపు పాయసం.. గారెలతో షడ్రసోపేతమైన భోజనం.. తరువాత ఆమె చేత్తోనే పనివాళ్లందరికీ బట్టలిప్పించి.. ధాన్యం కొలిపించేవారు సుందర్రావుగారు.

''అనంతం.. నీ చేత్తోనే అందరికీ అన్నీ పంచిపెట్టు.. నీది చల్లని చేయని వారందరి నమ్మకం!'' అనేవాయన.

ఆయన జ్ఞప్తికి వచ్చి అనంతమ్మ హృదయం భారమయ్యింది.

ఎప్పుడూ సుభద్రచేత సంక్రాంతినాడు బొమ్మల కొలువు పెట్టించేది. సుభద్ర పెళ్లయ్యి, అత్తవారింటికి వెళ్లేవరకు అది ఆనవాయితీగా కొనసాగేది. సాయంత్రం.. పసుపు, కుంకుమలు ఇంటింటా పంచి పెట్టేది. సుభద్ర బంగారుతల్లిలా, చిరుగజ్జెలు ఘల్లు మంటూ ఉండగా తల్లి వెనకాతలే తిరిగేది.

పుష్యమాసపు అందచందాలన్నీ కుప్పపోసినట్లుగా ఉండేది పల్లె. ఇంక కనుమ పండుగ. అది పశువుల పండుగ. ఇంటినిండా పాడినిచ్చే, ఆరోగ్యాన్నిచ్చే పశువులకు ఆరోజు పసుపు, కుంకుమలు పూసి సంక్రాంతి నాడు మిగిలిపోయిన గారెలను వాటికి తినిపించేవారు.

కనుమనాడు తలస్నానం చేసి మునిగితే, కాకి రూపు కాకికిపోయి మన రూపు మనకి వస్తుందంటారు పెద్దలు.

ఎందుకంటే చలికి శరీరం పగిలిపోయి, కమిలిపోయినట్టు నల్లగా అయిపోతుంది. కాని పండగ వెళ్లాక కొద్దిగా చలి తగ్గుముఖం పడ్తుంది. కాబట్టి శరీరపు రంగు కూడా యధాస్థానానికి వస్తుంది. దాన్ని కనుమ నాటి తలస్నానంతో అన్వయించటం.. ఎంత సంప్రదాయబద్ధంగా ఉందో..

మన పండగలకున్న ప్రాముఖ్యత, వైశిష్ట్యం అలాంటివి.

కాని.. కానీ.. ఈ నగర జీవితంలో పండగ ఆనందం ఎట్లా ఉంటుందో అనంతమ్మ ప్రత్యక్ష పూర్వకంగా చవి చూసింది.

మీడియా వ్యామోహంలో పడిన జనం.. సంప్రదాయాలన్నింటికీ క్రమంగా దూరమౌతున్నారు.

శాటిలైట్ ప్రభంజనానికి, ప్రజావాహిని ఎటువైపు కొట్టుకుపోతోందో.. అర్థంకాని అయోమయ పరిస్థితి.


ఒకటా రెండా.. వివిధ రకాల టి.వి ఛానళ్ల పోటీమధ్య మనిషి తిరగలిలో పప్పుబద్దలా నలిగిపోతున్నాడు.

అసలే మహాపట్నం.. అందునా ఈ టీవీల గోలలో అందరూ.. అన్ని సరదాలను మరచిపోతున్నారు.

అదే పల్లెలోనా.. పల్లెలో అయితే పండగ సంబరం అంబరాన్నంటుతుంది. ఏ ముంగిలి చూసినా పేడ కళ్లాపులు జల్లి, ముత్యాల ముగ్గులతో కళకళలాడిపోతుంది. ఒక్క పండగకే కాదు.. దాదాపు ధనుర్మాసం అంతా మంచి మంచి ముగ్గులతో వాకిలిని అలంకరిస్తారందంగా, పల్లెపడుచులు. పంటలు బాగా పండితే.. ఇంక పల్లెలో వైభోగానికంతే లేదు.

క్రిందటేడాది అనుకోకుండా తుపాను రావటంతో, పంటలన్నీ నామరూపాల్లేకుండా తుడిచిపెట్టుకుపోయాయి. అనంతమ్మ ఇక్కడుండలేనంటూ చిన్నకొడుకు కృష్ణ దగ్గరకి పయనమవుతుంటే పెద్దకొడుకు బలరాం వారించాడు.

''అసలే వాడు పంటలన్నీ పోయి గోలుగోలుమంటున్నాడు. ఈ సమయంలో నువ్వుకూడా ఎందుకమ్మా అక్కడికి. అందునా వాడి కొడుక్కి కూడా ఒంట్లో బాగోలే



దుట.

వాళ్ల బాధల్లో వాళ్లున్నారు. అయినా నీకిక్కడేం లోటు చెప్పు'' ఆమె ప్రయాణాన్ని ఆపేవాడు బలరాం.

''ఏం అత్తయ్యా.. మీకేమైనా బాధ కలిగిస్తున్నానా నేను. ఇబ్బందిగా ఉందా మీకిక్కడ. చెప్పండి'' ఆవేదనగా అడిగింది కోడలు రమ.

వాళ్ల మనసులు కష్టపెట్టడం ఇష్టంలేక తన ప్రయాణాన్ని విరమించుకుంది అనంతమ్మ అప్పుడు.

అసలు.. అనంతమ్మకి పట్నవాసం అంటేనే ఇష్టం ఉండదు. పట్నాల్లో ప్రజలు ఒకరినొకరు పట్టించుకోరనీ.. ఒకళ్లతో ఒకరికి సత్సంబంధాలుండవని ఆమె అభిప్రాయం. దానికితోడు ఇక్కడి వాతావరణం కూడా అలాగే ఉంది. ఆమె పట్నం రావడానికి పూర్వరంగం ఏమిటంటే.. తండ్రి సుందరావుగారి సంవత్సరీకాలకని వచ్చిన బలరాం.. తనతోపాటు తల్లిని తీసుకెళ్తానని అన్నాడు.

అప్పుడు కృష్ణ అన్నాడు ''అన్నయ్యా.. అమ్మకి ఎక్కడా ఉండటం అలవాటు లేదు. ఇబ్బంది పడ్తుందేమో.. ఇక్కడే ఉండనీరాదూ.. అని.''

''అమ్మ నాదగ్గర కూడా ఉండాలని నాక్కూడా కోరికగా ఉంటుంది కదరా. పైగా నాన్న పోయాక అమ్మ బాగా బాధపడుతోంది. కాస్త ప్లేస్ కూడా చేంజ్ అయినట్టుంటుంది. వాతావరణం మారితే అమ్మ కాస్త సర్దుకుంటుంది. కొన్నాళ్లుంచుకొని పంపేస్తాను'' అన్నాడు బలరాం.

అలా బలరాం బలవంతం మీద అతనితోపాటు పట్నం బయలుదేరింది అనంతమ్మ. ఆ రావటం.. రావటం.. ఇక్కడ చిక్కుపడిపోయిందామె. ఓ రెండు మూడుసార్లు కృష్ణవచ్చి ఆమెని చూసి వెళ్లాడు. అతనితో వెళ్లాలనుకుంటే బలరాం, రమ ఒప్పుకోలేదు.

''అస్తమానం రాగలవేంటమ్మా ఇంతదూరం.. ఎలాగూ వచ్చావు మరికొన్ని రోజులుండూ..'' ఆమెని ఆపేవారు. ఇక్కడ ఆమెకంతా బాగానే ఉంది. రమ కూడా అన్నివిధాలా అత్తగారిని గౌరవిస్తుంది. అనంతమ్మకన్నీ చేతికే అందిస్తుంది.

కానీ.. రమలో అనంతమ్మకి నచ్చని అంశం ఒకటుంది. ఇరవై నాలుగ్గంటలలో కేవలం నిద్రపోయిన సమయం తప్ప మిగిలిన అన్నివేళల్లో టీవీని అంటుకొనే ఉంటుంది ఆమె.

వంట కూడా తినటం తప్పదని చేస్తుంది కాని.. మనస్సు లగ్నంచేసి చేయదు.

రెండుమూడుసార్లు అనంతమ్మ అంది. ''అమ్మాయ్.. నాకింకా ఒంట్లో ఓపిక ఉంది. అన్నీ అక్కడ అమర్చిపెట్టు. నేను చేస్తాను వంట'' అని.

కాని రమ అందుకు అంగీకరించలేదు. ''ఎందుకత్తయ్యా.. ఇన్నాళ్లా కష్టపడ్డారు. ఇక్కడ కూడా మీకు శ్రమెందుకు..'' అని.

కాని శ్రమ చేయడంలోని ఆనందం ఆమె ఎరగదు.

వేళవేళలకి హార్లిక్సు, పాలు అన్నీ అందిస్తుంది. కాని తిండి విషయంలోనే వస్తుంది తంటా అంతా. అన్నీ బజార్లో రెడీమేడ్‌గా దొరుకుతూంటే ఒళ్లు కష్టపెట్టుకోవడం ఎందుకన్న భావం ఆమెలో అధికం.

అనంతమ్మకి బజార్లో కొన్న స్వీట్స్ అవీ నచ్చవు. అన్నీ ఇంట్లోనే తయారుచేసుకుంటే రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం అని ఆమె అభిప్రాయం. కాని కోడలు రమ వాదనల ముందు ఆమె ఇష్టాలు వీగిపోతాయి.

క్రిందటి పండగ అనంతమ్మను అంతులేని నిరాశకు గురిచేసింది. పంటలు సరిగా పండలేదన్న కారణంగా.. పట్నంలోనే చిక్కుబడిపోయి.. ఆమె పొందిన వేదనభావాలన్నీ ఆమె కన్నుల ముందు కదలాడాయి.

• • •

పండగ దగ్గర పడుతోంది. సున్నాలు వేయించమని కొడుక్కి చెప్పింది అనంతమ్మ.

కాని రమ ''ఇప్పుడెలా అత్తయ్యా.. ఇక్కడ పనివాళ్లంత తొందరగా దొరకరు. అన్ని సామాన్లూ తీసి మళ్లీ నేనొక్కద్దాన్నే సర్దుకోలేను. మామూలు రోజుల్లో ఎప్పుడైనా వేయించుకుంటాంలెండి'' అంది.

అంతేమరి నోరెత్తలేదు.

''అసలు.. ఇప్పుడు ఇళ్లకి సున్నాలు వేయిస్తేనే అందం. పండగెళ్లిన పాచినాడెందుకు'' సణుక్కుంది అనంతమ్మ.

పోనీ ఇక్కడ భోగిమంట వేస్తారేమో.. ''ఏమర్రా పిల్లలూ.. పిడకలు అవీ చేసి భోగిమంట వేస్తారా!'' అడిగింది మనుమలని. ''పిడకలా.. భలేదానివే బామ్మా. ఈ టౌన్‌లో ఎవరు వేస్తారు భోగిమంట!'' అంటూ నవ్వి ఆమెను గేలిచేశారు.

మనస్సు చివుక్కుమంది. అయినా ఏం మాట్లాడలేదు. వట్టప్పుడు ఎలాగూ ఇంట్లో ఏమీ చేయదు రమ. ఈ పండగకైనా నాలుగు రకాలు ఇంట్లో తయారుచేసుకుంటే బావుణ్ను. జిహ్వా పీకింది. ఎప్పుడూ తన చేతుల మీదుగా అన్నీ చేసి అందరికీ పెట్టే ఆమె పెద్దరికం ఈసారి చిన్నబోయింది.

అయినా ఆశ చావక కోడల్నడిగింది.

''రమా.. పనిమనిషిచేత కాస్తంత పిండి దంపించవే.. చక్కిలాలు చేసుకుందాం. నేను చుట్టిస్తాను. నువ్వు వేయిద్దూగాని.''

''మీరేంటి అత్తయ్యా. సుఖపడమంటే కష్టపడతానంటారు. అయినా ఇక్కడ పనిమనుషులు అలాంటి

# ఆమని ఆత్రం



ఆమనికి మంచి స్టార్‌గా పేరుంది. పెళ్ళి చేసుకుని స్థిరపడ్డాక భర్త సహకారంతో తమిళ్లో 'పెణ్ణిన్ మన దైర్యం తొట్టు' అనే బిగ్‌హిట్ సినిమాని తెలుగులో 'ప్రేయసీ.. నన్ను ప్రేమించు' పేరుతో డబ్ చేస్తున్నారు. తమిళ్‌లో సూపర్ డూపర్ హిట్టు ఈ సినిమా! మరి తెలుగు ప్రేక్షకులు నన్ను నిర్మాతగా ఎలా ఆదరిస్తారోనని చాలా టెన్షన్‌గా వుంది నాకు... అంది ఆల్చిప్పల్లాంటి కళ్ళని టపటప లాడిస్తూ! సో, ఆమనీ! వేచి చూద్దాం తమరి అదృష్టం.

## కాజోల్ కథ కమామిషు

★ నేనూ, షారూఖ్ చాలారోజుల తర్వాత 'కభీ ఖుషీ కభీగమ్' చిత్రంలో నటిస్తున్నాం.

★ ఈ సినిమా సూపర్, డూపర్ హిట్ అవుతుంది.

★ రాణీ ముఖర్జీ కూడా నటిస్తోంది.


★ నా పెర్సనల్ రిక్వెస్ట్‌తో అమితాబ్, జయాబచ్చన్ నటిస్తున్నారు.

★ ఈ సినిమా తర్వాత నేను తిరిగి విజృంభిస్తాను.

★ 'దిల్ క్యాకరే' నా వివాహానికి ముందే ప్రారంభమైంది.

★ అయినా పెళ్ళయినా నేనింకా ఫ్రెష్‌గానే కనిపిస్తున్నాను.

- విరాజి




పనులు చేయరు. మీ కొడుకుతో చెప్పి బజారు నుండి తెప్పిస్తానులెండి మీకంతగా తినాలనుంటే'' అంది రమ, అనంతమ్మ ఉత్సాహం మీద నీళ్లు జల్లుతూ.

భారంగా నిట్టూర్చింది అనంతమ్మ. పండగకి తనిలాగే ఊరుకునేదా. వారం రోజుల ముందునుండీ తను, కృష్ణుడి పెళ్లాం రాధ కలిసి ఎన్నెన్నో తయారుచేసేవారు. చక్కిలాలు, చేగోడీలు, జంతికలు, కజ్జికాయలు, కాజాలు.. ఒకటా రెండా అన్నీ తయారు చేసేవారు.

''తన స్వహస్తాలతో తయారుచేసినవి పిల్లలందరూ తింటూంటే తనకెంతో సంతృప్తి. కాని ఈ ఏడాది పండగకి ఇక్కడ చిక్కుకుపోయింది అనవసరంగా ఏ పనీ లేక.''

''పాపం అక్కడ కృష్ణుడు, రాధ, పిల్లలు ఎలా ఉన్నారో.. అప్పుడే తనిల్లు వదలి ఏడాదిపైనే అయ్యింది'' అనంతమ్మ దృష్టి చిన్నకొడుకు, కోడలు మీదికి మళ్లింది.

రాధ అనంతమ్మకి తగిన కోడలు. అనంతమ్మలాగే శ్రమజీవి. అనంతమ్మ అంతరంగాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకున్న మనిషి.

రమ కూడా మంచిదే.. కాని కాస్తంత పనిబద్ధకం ఆమెలో. పట్నవాసపు వింత వాసనలు ఆమెను పట్టి పీడిస్తున్నాయి.

భోగి పండగనాడు అంతమ్మకి ఎవరో తట్టి లేపుతున్నట్లుగా.. నాలుగు గంటలకే మెలకువ వచ్చింది. ఎక్కడా అలికిడి లేదు. ఇంట్లో కూడా అందరూ గాఢనిద్రలో మునిగిపోయారు.

వీధి కిటికీలోంచి బయటకు చూసిన అనంతమ్మకి వీధి చివరన ఓ మంట వెలుగుతూ కనబడింది. చలి పులిని తరిమేయడానికి వేసిన ఆ భోగిమంట అనంతమ్మ ఎదలో పన్నీటిజల్లుని కురిపించింది.

అక్కడకు వెళ్లి కాస్సేపు చలికాగుదామని అనుకుంది ఆమె. తలుపు తీస్తూంటే.. ఆ శబ్దానికి హాల్లో పడుకున్న కొడుకు మేలుకున్నాడు.

''ఎక్కడికమ్మా.. ఇప్పుడు?'' విసుగ్గా అన్నాడు బలరాం.

''మరేం లేదురా రాముడూ. వీధి చివరన ఎవరో భోగి మంట వేశారు. చలికి అక్కడ వెచ్చగా ఉంటుందని..'' నీళ్లు నమిలింది అనంతమ్మ.

''బాగుందమ్మా.. ఎవరో లేబరంతా కలసి వేసిన మంట దగ్గరికి నువ్వెళ్తావా. నా ప్రిస్టేజ్ ఏంగావాలి ఈ కాలనీలో. ఇంకా నాలుగు అయ్యింది. ఏం చేస్తావిప్పుటి నుండీ లేచి. పోయి పడుకో.''

కొడుకు మాటలకి నిర్ఘాంత పోయింది అనంతమ్మ.

''ఆఖరికి భోగి మంట దగ్గర కూడా వర్గవిబేధాలా.. భోగి మంట దగ్గర ఎంత హడావుడిగా ఉండేది తమింటిదగ్గర. పాలేర్లు, తామందరూ కూడా, తేడా లేకుండా అందరూ ఆ మంట దగ్గర చలి కాగేవారు.

బాధగా మూల్గింది ఆమె హృదయం.

ఆమె వేదనను ఎక్కువ చేస్తూ పూర్తిగా తెల్లారింది.

తొందర తొందరగా షాంపూలతో తలంటుకుని వచ్చేశారందరూ.

''కుంకుడుకాయలతో పోసుకోకూడదటే పాపా. జుట్టు అందంగా మెరుస్తుంది!'' అక్కరలేదని తెలిసినా సలహా ఇచ్చింది మనుమరాలికి.

''అబ్బా.. కుంకుళ్లతోనా. అంతసేపు బోర్.. పైగా చిక్కు ఎంతకీ వీడదు!'' కండిషనింగ్ షాంపులతో తలంటుకుందికి అలవాటుపడిన ఆ పిల్లకి అనంతమ్మ సలహా పాత చింతకాయ పచ్చడిలా తోచింది.

వంటగదిలోకి వెళ్లి కోడలితో అంది. ''రమా.. కాస్తంత పూర్ణం వేయవే. బొబ్బట్లు చేస్తాను.''

''మీకెన్నిసార్లు చెప్పినా అర్థంకాదత్తయ్యా.. ఇప్పుడన్నీ ఇంట్లోనే తయారు చేసుకోనక్కరలేదు. అన్నీ మార్కెట్లో దొరుకుతాయి'' అంటూ ''ఏమండీ.. మీరు స్నానం చేసి మార్కెట్‌కెళ్లి సుప్రియ ఫుడ్స్‌లో బొబ్బట్లు తీసుకొనిరండి. నేను కాసింత నిమ్మకాయ పులిహోర చేస్తానింట్లో'' అని ఆర్డర్ జారీ చేసింది భర్తకి.

బజారు నుండి బొబ్బట్లు తెచ్చాడు బలరాం. కాని ఆ రుచి అనంతమ్మను ఆకట్టుకోలేకపోయింది. ''ఛీ.. ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటివెనకాల చచ్చినట్లు ఆఖరికి ఇలా పండగ తిండి తినాల్సివచ్చింది'' రెండు కన్నీటి బిందువులు జారిపడ్డాయి ఆమె కన్నుల నుండి.

నిజానికి అది పెద్ద విషయం కాదు. కాని ఎన్నో ఏళ్లుగా పల్లెటూరిలోనే మనుగడ సాగించడం వలన, తన చేతిమీద నలుగురికి పెట్టే అలవాటుండడం వలన ఆమె మనస్సలా విలవిలలాడింది.

ఎవరూ భోగిపళ్ల పేరంటాలకి కూడా పిలవలేదు. అసలు అక్కడివారందరూ ఒకరితో ఒకరు అంటీముట్టనట్లుగా ఉన్నారు. కనీసం పండగపూటైనా.. ఇరుగు పొరుగు వారందరిళ్లల్లోనూ చంటిపిల్లలున్నారు. ''వీళ్లకి తెలియదా పిల్లలకి భోగిపళ్లు పోయడంతో వారిమీద ఏర్పడిన కనుదృష్టిపోయి, చీడ తొలగిపోతుందని. అయినా తన బాధ తనది కాకపోతే. తన ఆలోచనలు చాదస్తంగా అనిపిస్తుంది వాళ్లకి'' మళ్లీ అనుకుంది అనంతమ్మ.

ఇదే పల్లెలో అయితేనా.. ఈపాటికి భోగిపళ్ల పేరంటాళ్లందరితోనూ ఇల్లు కళకళ లాడిపోతాయి. పిల్లలకు దిష్టి తీసి పోసిన రేగుపళ్లు, చెరుకు ముక్కలు, శెనగలు.. చిల్లర పైసలు ఇంట్లో పిల్లలెవరూ ఏరుకోకుండా జాగ్రత్తపడేవారు.

ప్రతీ ఘట్టాన్నీ.. పల్లెతో.. పట్నంతో బేరీజు వేసుకుంటోంది అనంతమ్మ పదే పదే.

ఇంక సంక్రాంతి అంతకన్న చప్పగా అనిపించింది.

''ఒరే అబ్బాయి.. తలారా స్నానం చేసి.. మీ నాన్నగారికి, పెద్దలకి తర్పణం వదలాలిరా..'' అంది కొడుకుతో.

''అమ్మా.. ఈ టౌన్లో ఇలాంటివన్నీ ఏంటమ్మా.. నాకా మంత్రాలు రావు. తలారా స్నానం మాత్రం చేస్తానులే'' అన్నాడు బలరాం.

''వాడు చెప్పింది కూడా నిజమే. కాని మనసుంటే మార్గం ఉండదా. ఆ మారాజుకి పండగపూట ఇంత తర్పణం వదిలే దిక్కుకూడా లేదు.'' అనంతమ్మ కళ్లు నీటి చెలమలయ్యాయి స్వర్గంలోకి పయనమయిపోయిన భర్తను తలచుకుంటే.

ఆమెలో ఉత్సాహం అంత అడుగంటింది. ఆమె మనోఫలకం మీద తన ఊర్లోని పండగ సంబరమంతా పరవళ్లు త్రొక్కుతూ కనిపిస్తోంది.

ఎడ్ల పందాలు, కోడిపందాలు ఎంత అట్టహాసంగా జరిగేవి.

ఎవరూ పసుపు, కుంకుమలు కూడా పంచలేదు. కోడల్ని వెళ్లమంది పసుపుకుంకాలు పంచడానికి.

''ఇక్కడెవరూ అలాంటి ఆచారాలు పాటించరత్తయ్యా. ఒకవేళ మనం పంచడానికి వెళ్లినా ఎవరూ పట్టించుకోరు. అందరూ బిజీగా ఉంటారు'' అంది రమ. ఆమె తపన ఆమెది. టీవీలో ప్రోగ్రాంలు మిస్ అయిపోతాయేమోనని.

''పసుపు, కుంకుమలు పంచిపెట్టుకోవడం ఎంత శుభకరం. ఆడదానికి పసుపు కుంకుమలే కదా ముఖ్యం. అది కూడా ఇక్కడ చాదస్తంగానూ, పిచ్చిగానూ అనిపిస్తోందా. సంక్రమణ పుణ్యకాలం ఉండగానే దేవుడి దగ్గర ముందర సమర్పించి, అందరిళ్లకీ పంచుకొనేవారు. తను.. రాధ కలిసి'' మళ్లీ అనంతమ్మ కన్నుల ముందు తన ఊరి పండుగ దృశ్యం. ఒక తైల వర్ణ చిత్రంలా ఆవిష్కరింపబడింది.

అవునుమరి. ఆమె సత్సాంప్రదాయాల మధ్యనే పుట్టి పెరిగింది. అవే ఒంటపట్టించుకుంది.

''పాపం.. కృష్ణుడు ఎలా ఉన్నాడో.. ఈసారి.. పంట కూడా చేతికి రాలేదు. అసలే రాజుగాడికి కూడా ఒంట్లో బాగులేదుట. ఏం చేస్తున్నారో ఏమో'' అనంతమ్మలోని తల్లి హృదయం విలవిలలాడింది.

సుభద్ర పండగకొచ్చి అప్పుడే చాలారోజులయ్యింది. నిరుటి పండగ ముందరే ఆయన కాలంచేశారు. అందుకే ఇంట్లో పండగ జరుపుకోలేదు. తండ్రి పోయే నాటికి ఆమె నిండు గర్భిణి. బిడ్డపుట్టడం.. ఉయ్యాల, బారసాల.. అన్నీ వాళ్లత్తవారంటిలోనే జరిగిపోయాయి. ఏ అచ్చట, ముచ్చట తల్లిగా తను తీర్చలేకపోయింది. కనీసం ఈ పండుగకయినా ఆమెని పిలుద్దామంటే.. కృష్ణుడి పరిస్థితి అలాగ ఉంది. పైగా కొడుక్కి కూడా ఒంట్లో బాగులేదు. ఈ పరిస్థితుల్లో కృష్ణుడిని నిందించటం తగదు'' బలరాం ఇంటికి పెద్దవాడయినా దూరంగా ఉండటంతో కృష్ణ దగ్గరే చనువు సుభద్రకి. పైగా రమ అంత కలివిడి మనిషి కూడా కాకపోవడంతో ఇక్కడికి పండగకి రమ్మనాలనే ఊహ కూడా తట్టలేదు అనంతమ్మకి.

తరువాత కనుమరోజు కూడా నిరుత్సాహంగానే గడిచింది. ఈ పట్నవాసంలో పండగరోజులు ఆమెను తీరని అసంతృప్తికి గురిచేశాయి. ఆమెలో అంతులేని ఆవేదన.. సముద్రమంత విచారం.

''వచ్చే ఏడాదయినా తనింటికి తను చేరుతుందో లేదో.. అనుకుంది అనంతమ్మ'' అక్కడ పండగ రోజుల్ని గడిపాక.

• • •

''ఏంటత్తయ్యా.. ఆలోచిస్తున్నారు. లోపలికి రండి. భోజనం వడ్డిస్తాను'' రమ పిలుపుతో ఏడాది క్రితం జరిగిన సంఘటనలన్నింటినీ నెమరు వేసుకుంటున్న అనంతమ్మ, ఉలిక్కిపడి ఆ జ్ఞాపకాల నుండి తేరుకుంది.

లేచి ఆమె వడ్డించిన భోజనం తిని నడుం వాల్చింది. ''ఏమిటో కృష్ణుడింకా ఉత్తరం రాయలేదు. ఈ ఏడాదయినా పంట చేతికొచ్చిందో లేదో..'' అప్పటికలా అనుకొని ఏ పదోసారో. అలా ఆలోచిస్తూనే నిద్రలోకి జారిపోయింది అనంతమ్మ.

ఆ మర్నాడు సాయంత్రం ఇంటికొచ్చిన బలరాం.. ''అమ్మా.. తమ్ముడు ఉత్తరం వ్రాశాడు'' అని అన్నాడు.

''ఏం రాశాడురా. అందరూ బాగున్నారా. పిల్లలు.. మరదలు.. అందరూ కులాసానా!'' ఆత్రుతగా అడిగింది ఆమె.

''ఆ.. ఆ.. అందరూ బాగున్నారమ్మా. ఈ ఏడాది పంటలు బాగా పండాయటమ్మా. బాగా లాభాలొచ్చినాయంట. అందుకని నిన్ను తీసుకుని వెంటనే బయలుదేరి రమ్మని వ్రాశాడు. మమ్మల్ని కూడా రమ్మన్నాడు. సుభద్రను కూడా పిలిచారట. అందరం కలిసి పండగ జరుపుకోవాలని వాడికి మహాకోరికగా ఉందిట. ఏం రమా ఏమంటావు?'' అడిగాడు బలరాం.

''నేనేమంటాను.. మీ ఇష్టం'' అందామె.

''అత్తయ్య అస్తమానం మా ఊళ్లో పండగ.. అని మురిసిపోతూ ఉంటారు. అదేమిటో చూడాలని నాకూ సరదాగా ఉంది'' అంది రమ.

ఆ వార్త విన్నాక, ఒక్కసారి ఆనందంతో వెర్రిగంతులు వేసింది అనంతమ్మ మనసు. ''ఎన్నాళ్లకి ఈ శుభవర్తమానం వింది. అందరూ కలిసి పండగ జరుపుకోవాలన్న తన మనోరథం ఈనాటికి ఈడేరబోతోంది. ఇంక చచ్చినా ఆ పల్లెవిడిచి రాదు. బలరాముడేమనుకున్నా సరే'' గట్టి నిర్ణయానికి వచ్చింది అనంతమ్మ.

అది మొదలు ప్రయాణం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిందామె.

ఆఫీసులో ఓవారం రోజులు లీవ్ తీసుకున్నాడు బలరాం. భార్యతోపాటు చెల్లెలికి.. మరదలికి కూడా చీరలు తెచ్చేడు. ఏవేవో స్వీట్స్ కూడా కొని పట్టుకొచ్చాడు.

అందరూ కలిసి ప్రయాణమయ్యారు. బలరాం పిల్లలకి కూడా చాలా ఉత్సాహంగా ఉంది. ఎప్పుడో పట్టప్పుడు వెళ్లటమే గాని, ప్రత్యేకించి పండగలకని పల్లెకి వెళ్లడం వారెరుగరు. నాన్నమ్మ అస్తమానం వర్ణించే ఆ సంతోషం ఎలా ఉంటుందో కన్నులారా చూడాలని అనుకోవడమే వారి ఉత్సాహానికి కారణం.

తమ ఊరు చేరుతూనే ఊరిలో వచ్చిన

## చదువు జాగ్రత్త



''మీ అబ్బాయిని స్కూల్లో చేర్పించారా?'' అడిగాడు అరాగ్రావు.

''లేదింకా. ఈ ఏడాదంతా బరువులు మొయ్యడం ప్రాక్టీస్ చెయ్యించి నెక్స్ట్ ఇయర్ జాయిన్ చేద్దాం అనుకుంటున్నాం స్కూల్లో'' చెప్పాడు ముందుచూపురావ్.

## ఖచ్చితంగా...

''నీ భార్య పుట్టింటికెళ్లిందని నేను ఖచ్చితంగా చెప్పగలను'' అన్నాడు ఆనందరావు.

''అరె...ఎలా చెప్పగలిగావ్? కొంపదీసి నీకు దివ్య దృష్టిగానీ వుందా?'' ఆశ్చర్యంగా అడిగాడు చిన్నారావు.

దానికి ఆనందరావు నాలిక చప్పరించి ఇలా అన్నాడు.

''ఆపాటిదానికి దివ్యదృష్టే వుండాలా? నీ ముఖంలోని ఆనందం చూస్తుంటే తెలీడంలా?''

## అన్వర్థత

''ఏంటీ? నీకు షుగర్ వ్యాధి లేనందుకు ఉద్యోగం ఇవ్వం పొమ్మనేశారా? ఇంతకీ నువ్వు ఇంటర్వ్యూకి వెళ్లింది ఏ ఉద్యోగానికి?'' అడిగాడు చిన్నారావ్.

దానికి అన్నారావ్ నిట్టూర్చి ఇలా బదులిచ్చాడు.

''చక్కెర ఫ్యాక్టరీలో స్టోర్‌కీపర్ ఉద్యోగానికి.''


-భానుకిరణ్ (సీతాఫల్‌మండి)


## ఇష్టంలేక...

''ఎందుకు నీ భార్యను చంపావు'' అడిగాడు జడ్జి.

''నా భార్య చేతిలో ముందుగా నేను చావడం ఇష్టంలేక'' చెప్పాడు గోపి.

-సి.ఎస్. లలిత (కువైట్)





## షార్క్ చేపల స్పర్శ జ్ఞానం

ప్రతీ ప్రాణీ నీటిలో విద్యుత్ క్షేత్రాన్ని కల్పిస్తుంది. మహా సముద్రాల్లో ఉండే షార్క్ చేప శిరస్సులో జ్ఞాననాడులవల్ల విద్యుత్ క్షేత్రాల్లో నిరపాయకరంగా నివసించగలుగుతున్నాయి. జంతువులన్నింటిలో షార్క్ చేపలకు విద్యుత్ స్పర్శజ్ఞానం చాలా సున్నితంగా వుంటుంది.

## పాబ్లో పికాస్సో చిత్రాల విలువ

స్పానిష్ దేశానికి చెందిన, 20వ శతాబ్దంలో జన్మించిన గొప్ప చిత్రకారుడు పాబ్లో పికాస్సో. ఇతని చిత్రాల విలువ 750 మిలియను డాలర్లు. 1967లో ఇతని 'టు బ్రదర్స్' మరియు 'సీటెడ్ హార్లెక్విన్' అనే చిత్రాలు రెండూ 19,50,000 డాలర్ల రికార్డు వెలకు అమ్మబడ్డాయి.

## 35 ఆస్కార్ అవార్డులు

మిక్కీమౌస్, డొనాల్డ్‌డక్ వగైరాలను సృష్టించిన అమెరికన్ ఫిల్మ్ ప్రొడ్యూసర్ వాల్ట్‌డిస్నీ 1931 ఇంకా 1969 సంవత్సరాల మధ్య ఉత్తమ ఫిల్ములకు 35 ఆస్కార్ అవార్డులు పొందాడు.

## లెటర్ రైటింగ్ పోటీ

1987లో స్విట్జర్లాండ్‌లోని బెర్నే వరల్డ్ పోస్టల్ సెంటర్, యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్ సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్‌వారు ఉమ్మడిగా నిర్వహించిన అంతర్జాతీయ ఉత్తరాల రాత పోటీలో తమిళనాడు (తరంగంబాడి) 'ట్రాన్క్విబార్'కు చెందిన లక్ష్మి అనే ఆరవ తరగతి విద్యార్థిని మొదట బహుమతిని గెలుచుకుంది.

**- జి.శారద**

మార్పులకు విస్తుపోయింది అనంతమ్మ. ప్రత్యేకించి ప్రతి ఇంట్లోంచీ టీవీలు ఎలుగెత్తి తమ హోరును చాటుతున్నాయి.

''ఇక్కడా దాపురించిందన్నమాట ఈ మాయరోగం!'' అక్కసుగా అనుకుంది అనంతమ్మ.

అవును.. ఈ ఏడాదిన్నర కాలంలో పల్లెల్లో కూడా పలురకాల మార్పులొచ్చాయి. శాటిలైట్‌గాలి బలంగా వీస్తోందక్కడ కూడా. ఇల్లు చేరేసరికి ఇంట్లో కూడా అదే దృశ్యం. అందరూ టీవీల ముందు ఆశీనులయ్యి ఉన్నారు.

అది చూసిన అనంతమ్మ అంతరంగం చిన్నబోయింది.

''రామేశ్వరం వెళ్లినా.. శనేశ్వరం తప్పనట్లు.. ఈ పాడుగోల ఇక్కడ కూడా తప్పలేదా!'' అనుకుంది బాధగా.

వీళ్లని చూస్తూనే లేచి ఎదురుగా వచ్చారు కృష్ణ, రాధ, సుభద్ర, ఆమె భర్త.

అత్తగారి కాళ్లకి నమస్కరించి, అందరినీ కుశల ప్రశ్నలు వేసి త్రాగడానికి మంచినీళ్లిచ్చింది. బలరాం పిల్లలు కూడా వెళ్లి టీవీ ముందు సెటిలయ్యిపోయారు.

కృష్ణ కూడా తల్లిని చూసి పొంగిపోయాడు. ''అమ్మా.. ఇన్నాళ్లు నిన్ను విడిచి ఎప్పుడూ ఉండలేదని'' బాధపడ్డాడు.

''అమ్మా!'' అంటూ సుభద్ర కూడా తల్లిని చుట్టుకుపోయింది.

''ఎన్నాళ్లయ్యిందే తల్లీ.. మిమ్మల్నందరినీ చూసి. మీనాన్నగారు పోయారు. నీ అచ్చట ముచ్చట.. నా చేతుల మీదుగా జరిపించలేకపోయాను. అన్నీ దుర్దినాలు. ఏదీ నా చిట్టితల్లి!'' కళ్లనీళ్ల పర్యంతమవుతూ మనుమరాల్ని ముద్దులాడింది అనంతమ్మ.

క్రొత్తకావడం మూలాన కాస్త సిగ్గునభినయించిందా పిల్ల. ముద్దుగా, బొద్దుగా ఉంది సుభద్ర కూతురు. ''చిన్నప్పుడు సుభద్ర కూడా ఇలాగే ఉండేది. అచ్చు దాని పోలికే!'' అనుకుంది అనంతమ్మ అపురూపంగా.

''అమ్మగోరూ మీరింటికాడ నేకపోటం.. మూలకంగా.. ఇల్లు శానా సిన్నబోనాది'' అన్నారు పాలేరు రంగడు, పనిమనిషి రత్తి.

రాధ కూడా అత్తగారిని చూసి కళ్లనీళ్లు పెట్టుకుంది. ''ఇన్నాళ్లూ మిమ్మల్ని వదలి ఎప్పుడూ ఉండలేదత్తయ్యా.'' అంటూ.

''అక్కడున్న ఇన్నిరోజులూ.. అత్తయ్యకిదే ధ్యాస. ముళ్లమీదున్నట్లుగా ఉన్నారు మా ఇంట్లో. ఉన్నన్నాళ్లూ ఇటే దృష్టి ఆవిడకి. ఎలాగయినా ఆవిడకి నీమీదే ప్రేమెక్కువలే రాధా!'' అంది రమ కినుకగా.

''అదేం కాదులే వదినా. అమ్మ ఏనాడూ ఈ ఇంటి గడప దాటెరగదు. ఎంత ... ఈ ఇల్లే ఆవిడకి స్వర్గం. అది అసలు ... నవ్వుతూ అన్నాడు కృష్ణ.

''క్రితంసారి పంటలన్నీ అతివృష్టి వలన ... యాయి. కొబ్బరిచెట్లన్నీ పడిపోయి, పాకలన్నీ ... పోయి ప్రకృతి నానా బీభత్సం సృష్టించింది. ఏదో ... ధాన్యం ఉండబట్టి తిండికి లోటులేకుండా జరి... దానికితోడు రాజుగాడికి ఒంట్లో బాగులేదు. ఎన్ని ... టల్స్‌లో ఎన్నేసి రోజులు గడిపామో లెక్కేలేదు. ఏదో ... వంతుడు కరుణించి ఈ ఏడాది పంటలు బా... పండాయి. వాడి ఒంట్లో కూడా బాగుపడింది. ... చేతికొచ్చిన దగ్గర్నుండీ మీ అబ్బాయి ఒకటే గొడవ. అమ్మను వదిలి అప్పుడే ఏడాదిపైనే అయ్యింది. ప... గకి అందరినీ రమ్మని రాస్తానన్నారు. అంతకన్నా ఆనందం ఏముంటుంది సరేనన్నాను'' రాధ చెప్పుకుపోయింది గబగబా.

''అన్నట్లు మరిచేపోయాను. ఇంతకీ రాజుగాడేడే. వెధవాయ ఎన్ని బాధలు పడ్డాడో. వాడి వయసుకు తగిన బాధలా అవి'' అనంతమ్మలో వాత్సల్యం కట్టలు త్రెంచుకుంది.

''ఊళ్లో అందరూ కేబుల్ కనెక్షన్ పెట్టించుకున్నారు. మనక్కూడా పెట్టించమని ఒకటే అల్లరి చేస్తే నెలరోజులు అయి కేబుల్ పెట్టించారత్తయ్యా. ఏదో అంత్యాక్షరి ప్రోగ్రాం వస్తోందిట. అందరూ అక్కడే తిష్టవేశారు.''

ఒక్కసారిగా.. తన ఆశల హరివిల్లు చెదిరిపోయినట్లు అయ్యింది అనంతమ్మకి.

''ఈ మారుమూల పల్లెటూరిలో కూడా ఈ కేబుల్ తెగులు పాకిపోయిందా?! చక్కా ఇదివరకు వారానికో సినిమా వచ్చేది. వారం రోజులు ఎదురుచూసి ఆదివారంనాడు అపురూపంగా టి.వి ముందు కూర్చుని చూసేవారందరూ. కాని ఇప్పుడు టి.వి అంటేనే రోత పుట్టింది. రకరకాలైన ఛానళ్లలో అనేకమైన ప్రోగ్రామ్స్. అన్నీ కలగా పులగంగా చూసి చూసి మెదడు పిచ్చెక్కిపోయి ఉందక్కడ. ఇక్కడ కూడా ఇదే తలనొప్పా'' అనంతమ్మలో నిరుత్సాహం. తనాశించిన ఆనందం ఇక్కడా దక్కదేమో'' అన్నబాధతో ఆమె హృదయం బరువెక్కింది.

''పిల్లలూ.. అందరూ భోజనాలకి లేవండి. ఆ తరువాత టీవీ చూడచ్చు'' ఠక్కున టీవీ ఆఫ్ చేసింది రాధ.


ఆ చర్యకి అనంతమ్మ ముఖం వికసించింది.

మొదట కాస్త అలిగినట్లు ముఖాలు పెట్టినా.. మంత్రముగ్ధులైనట్లుగా అందరూ రాధ వెనకాల వంటగదిలోకి నడిచారు.

దొండకాయ వేపుడు, బంగాళదుంప బఠాణీలు వేసిన కూర. అన్ని రకాల కూరగాయల ముక్కలు వేసిన సాంబారు.. కారప్పూస.. కాజాలతో భోజనం వడ్డించింది రాధ.

అనంతమ్మ నాలుక మీద గడ్డి మొలిచినట్లయ్యిందిన్నాళ్లూ. ఆ పదార్థాలను చూడగానే ఆమెకు జిహ్వా లేచొచ్చింది. అపురూపురుమంటూ తిందామన్న అనంతమ్మ పిడికెడు మెతుకులు కూడా తినలేకపోయింది.

ఆనందంతోనే ఆమె కడుపు సగం నిండిపోయింది.



''ఇవన్నీ నువ్వే చేశావా రాధా?'' భోంచేస్తూ అడిగింది రమ.

''అవునక్కయ్యా. పండగకి నలుగురూ వస్తారు. అన్ని రకాలు ఇంట్లో చేస్తే సరదాగా అందరూ తింటారని ప్రక్క సుబ్బులు మామ్మగారిని సాయం పిలిచి చేశాను. ఎలా ఉన్నాయక్కయ్యా!'' అడిగింది రాధ.

''చాలా బాగున్నాయమ్మా. మీ అక్కయ్య ఇంట్లో ఇలాంటివేమీ చేయదు'' మెచ్చుకోలుగా అన్నాడు బలరాం.

''ఆ.. మనకన్నీ రెడీమేడ్‌గా దొరుకుతాయి కదా. ఇంకా ఒళ్లు పులవ పెట్టుకోవడం ఎందుకు?'' రమ చిన్న జెలసీ ఫీలయ్యింది భర్త మాటలకి.

''అన్నీ దొరికినా.. ఇంట్లో చేసుకున్న రుచి వస్తుందా అక్కా. సరేలే ఎవరిష్టం వారిది. త్వరగా భోజనాలు కానీయండి'' రాధ రమలో పొడసూపిన ఈర్ష్యాభావాన్ని గమనించి సర్దిచెప్పింది.

ఆ రాత్రి వాకిలి నిండా పేడనీళ్లు జల్లి పెద్ద పెద్ద ముగ్గులు వేసి వాటిని రంగులతో అలంకరించారు. వాటి మధ్య గొబ్బెమ్మలనుంచారు.

పగలే కోసుంచిన మామిడాకుల తోరణాలు కట్టి.. బంతిపూల దండలు ద్వారబంధానికి వ్రేలాడదీశారు.

ఇంట్లో అప్పుడే పండగ శోభ అంతా నిండిపోయినట్లనిపించింది అనంతమ్మకి ఆ దృశ్యం చూసి.

''రేపు భోగిమంట వేస్తారో లేదో.. ఏమో ఏ సందడీ ఎక్కడా లేదు'' ఆలోచిస్తూ అనంతమ్మ నిద్రలోకి జారుకుంది.

• • •

తొలికోడి కూసింది. అనంతమ్మ తననెవరో కుదిపి లేపుతుంటే మేలుకుంది. ఎదురుగా రాధ.

''అత్తయ్యా లెండి. మన పెరట్లో భోగిమంట వేశాం. రంగడు.. రత్తి అందరూ వచ్చారు. లేవండి!'' అంటూ అనంతమ్మని మేలుకొలిపింది.

పెరట్లోకి వెళ్లిన అనంతమ్మ మనసు భోగిమంటను చూసి చంటి పిల్లకి తాయిలం దొరికినంత సంబరంతో కేరింతలు కొట్టింది.

అప్పుడే రెండేళ్లయ్యింది ఈ వేడుకలన్నీ చూసి. అనుకుంటూ పెరట్లోకి దారితీసింది.

''అమ్మగోరు వత్తన్నారు. సోటియ్యండహె..'' అంటూ పనివాళ్లు ప్రక్కకు జరిగి అనంతమ్మకు జాగా ఇచ్చారు.

భోగిమంటలో వెచ్చగా చలికాగింది అనంతమ్మ. అందరినీ లేపి తీసుకొచ్చింది రాధ. మొదట గునిసినా రమ, పిల్లలు రాధ బలవంతంమీద రాకతప్పలేదు.

భోగిమంటలో పాత కర్ర, కంప, పిడకలు అన్నీ వేశారు.

తెల్లారి పోయింది ఈ హడావుడి అంతా పూర్తయ్యేసరికి.

పెరట్లో పొయ్యిమీద పెద్దకాగుతో వేణ్ణీళ్లు కాగబెట్టాడు రంగడు. ముందురోజు ఉడకబెట్టి ఉంచిన కుంకుడు కాయలతో, చక్కా ఒంటికి నువ్వుల నూనె పట్టించి, నలుగుపెట్టి తలంటింది రత్తి అందరికీ.

బలరాం సంతానానికి ఇదంతా చాలా విచిత్రంగా ఉంది. కానీ వాటిలోని ఆనందాన్ని ఆస్వాదిస్తున్నాయి వారి లేత మనసులు.

రాధ అంది.. ''సుభద్ర కూతురికి భోగిపళ్లు పోయాలి కదా.. పాపా నువ్వు చెల్లాయి కలసి అందరిళ్లకీ వెళ్లి పేరంటం పిలుచుకుని రండి'' బలరాం కూతురితో అంది.

''అలాగే పిన్నీ..'' ఛెంగున గంతుకుంటూ బయలుదేరి వెళ్లింది ఆ అమ్మాయి పట్టులంగా గరగర రాడిస్తూ.

''భోగిపళ్ల పేరంటం చేస్తూ కూర్చుంటే టి.వి. ప్రోగ్రామ్స్ అన్నీ మిస్ అయిపోతాం రాధా!'' అంది రమ ఆదుర్దాగా.

''ఎప్పుడూ ఉండే ప్రోగ్రామ్సేగా అక్కయ్యా. పండగ.. అందునా ఈ పెద్దపండగ వచ్చేది ఏడాదికోసారే- కదా. యాంత్రిక జీవనంలోపడి మనం జీవితంలో సున్నితమైన అనుభూతుల్ని ఎన్నింటినో కోల్పోతున్నాం. నిత్యం సమస్యలతో కొట్టుమిట్టాడుతూ.. బ్రతుకు పోరాటం సల్పుతున్న మనిషి జీవితంలో ఈ పండగలు ఒక ఉపశాంతి. ఒక రిలీఫ్. బిజీ బిజీ బ్రతుకులకొక ఆట విడుపు. మనం ఎదుర్కునే ఎన్నో ఒడిదుడుకులను ఈ సంబరంలోపడి మరచిపోయి.. అందరం ఒకచోట కలసి మెలసి హాయిగా ఉండగలుగుతాం!'' అంది రాధ.

''బాగా చెప్పావమ్మా. మెకానికల్‌గా జీవించడం మనకి బాగా అలవాటయిపోయింది. అలాంటి ఈ లైఫ్‌లో మధ్య మధ్యన ఇలాంటి రిక్రియేషన్స్ చాలా అవసరం!'' ఆమె భావాల్ని సమర్ధిస్తూ అన్నాడు బలరాం.

''మానవుడు ఎంతో అభివృద్ధిని సాధించిన ఈ రాకెట్ యుగంలో, ఇంకా ఇలాంటి సంప్రదాయాల్ని పాటించడం అవసరమా!'' అడిగింది రమ.

''అవసరం.. అనవసరం.. అన్నమాట అటుంచు. మన సంప్రదాయాలన్నీ సైంటిఫిక్ రీజన్స్‌తో ముడిపడి ఉన్నాయని గుర్తించాలి మనం. మనం ఇంటికి మామిడాకులు పచ్చివే ఎందుకు తోరణాలు కట్టుకుంటాం? ప్లాస్టిక్ వయినా కట్టుకోవచ్చుకదా. ప్లాస్టిక్‌వి అందానికి మాత్రమే పనికొస్తాయి. కాని పచ్చి మామిడాకులు అందంతోపాటు, ఆహ్లాదాన్ని వాతావరణంలో పరిశుద్ధతను పెంచుతాయి. అలాగే ఇంటి గడపలకి పసుపు రాస్తాం. ముఖానికి రాసుకుంటాం. వంటలలో కూడా వాడతాం. అఫ్‌కోర్స్ ఇప్పుడు పసుపు రాసుకోవటం ఫ్యాషన్ కాదనుకో. పసుపు పుణ్యస్త్రీలకి మంగళకరం అన్న విషయం

## ఉపేంద్ర స్టయిలే వేరు



ఏపని చేసినా వెరైటీగా చెయ్యడం ముందు నుండీ ఉపేంద్రకు అలవాటే. అందుకే అతని సినిమాలు, టైటిల్సూ, కాస్ట్యూమ్స్, లొకేషన్సూ, ఎండింగ్‌లు అన్నీ డిఫరెంట్‌గా వుంటాయి. 'ఎ' సినిమాకి ఎంత పేరొచ్చిందో మనందరికీ తెల్సు. అందుకే ఇటీవల 'రా' అనే కొత్త టైటిల్‌తో ఓ సినిమా మొదలుపెట్టాడు. మనవాళ్ళు ఏదైనా ఓ పదం ముందుపెట్టి 'రా'ని తగిలించేవారు. ఉదాహరణకు 'ప్రేమించుకుందాం.. రా' అంటూ. కానీ ఈసారి ఉపేంద్ర ఏకంగా 'రా'నే టైటిల్‌గా పెట్టాడు. సో, ఈ వెరైటీ టైటిల్ సినిమా వెరైటీగా వుంటుందని ఆశిద్దాం!

## కాశ్మీరాషా బిజీనా?

'అడవి' చిత్రంలో లేడీ విలన్‌గా నటించిన కాశ్మీరాషా హిందీలో ఇప్పుడు బిజీ అయిపోయిందిట. ఆమెను కదిపితే కదిలిన విషయాలు.

★ 'వాస్తవ్' చిత్రంలో 'జవానీసే అబ్ జంగ్ హోనే లగే' అనే పాటకు నేను చేసిన డ్యాన్స్ సూపర్ అని అందరూ తెగ మెచ్చుకున్నారు.


★ 'జంగిల్' చిత్రంలో కూడా నాకు మంచి పేరొచ్చింది.

★ 'హెలెన్' వారసురాలు అని ప్రశంసిస్తున్నారు.

★ జమూసుగంధ్ రూపొందిస్తున్న 'సిస్టమ్'లో, సల్మాన్ హీరోగా వస్తోన్న 'కహీ ప్యార్ నహో జాయే'లోనూ విభిన్న పాత్రలు పోషిస్తున్నాను.

★ ఇక నుండి వ్యాంప్ డ్యాన్సులు మానేసి, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మాత్రమే నటించాలని అనుకుంటున్నాను.

- విరాజి



## రేటు!

ఓ కాస్మెటిక్స్ షాపులోకి వెళ్లాడు రాజు.

సేల్స్‌గర్ల్ పెదవులవైపు వేలు చూపించి ''అదెంత?'' అని అడిగాడు.

''వంద రూపాయలు'' చెప్పింది సేల్స్‌గర్ల్.

''నేనడిగింది నీ పెదవుల రేటుకాదు. నువ్వు వేసుకున్న లిప్‌స్టిక్ రేటు!''

-సి.ఎస్.లలిత (కువైట్)

## చాలా మంచిది

''ఒరే! మా ఆవిడ చాలా మంచిదిరా. నేను వండి పెడితే పాపం తను తిని పెడుతుంది.''

''మా ఆవిడ మరీ మంచిది తెలుసా? నేను ముద్దలు కలిపి పెడితే పాపం తను నమిలి పెడుతుంది.''

''అయ్యో వెర్రి వెంగళాయిల్లారా! మీ ఇద్దరి పెళ్ళాలకన్నా మా ఆవిడే చాలా మంచిది. ఎందుకంటే మీకుమల్లే నేనేమీ చెయ్యక్కర్లేదు. పాపం తనే రోజూ నా మెదడు తింటుంది.''

## కమీషన్


''ఒరే గోపాలం! నేను నీకు పదిరూపాయలిచ్చి ఓ మసాలా దోస తెమ్మాన్నాననుకో. దోశ ఖరీదు ఎనిమిది రూపాయలు. ఇంకా నాకు నువ్వు ఎంత ఇవ్వాలిరా?'' ప్రశ్నించాడు మాస్టారు.

''ఏమీ ఇవ్వక్కర్లేదండీ'' ఠక్కున చెప్పాడు విద్యార్థి.

''ఏరా తమాషాగా వుందా?'' కోపంగా అన్నారు మాస్టారు.

''అబ్బే లేదండీ. నాకు ఏ పని చేసినా కమీషన్ తీసుకునే అలవాటుందండీ. రెండు రూపాయలు నా కమీషన్ కింద ఉంచుకుంటానన్నమాట.''

-ఎస్.లక్ష్మీదేవి (చోడవరం)




మనకి తెలుసు. దాన్తోపాటు పసుపు అనేక ఔషధ గుణాలతో నిండి ఉందన్న విషయం కూడా తెలుసుకోవాలి మనం. పసుపులో ఉండే యాంటీ సెప్టిక్ గుణాలవలన అది రోగ నిరోధకంగా కూడా పనిచేస్తుంది. మానవుడు ఎంత ఎత్తుకి ఎదిగినా, ఉన్నత శిఖరాలనధిరోహించినా వీటన్నింటినీ విస్మరించడం.. చాలా ఘోరం, నేరం. ఇంక పాటించడమంటావా.. వాళ్లవాళ్ల ఇష్టం.'' సహేతుకంగా వివరించింది రాధ.

''చర్చ ఎక్కడో ప్రారంభమై ఎక్కడో ముగుస్తోంది. ఇంక ఈ వాగ్వివాదాలు ఆపి మాకింత భోజనం పెట్టేదేమైనా ఉందా!'' హాస్యంగా అన్నాడు కృష్ణ.

''మీకంతా వేళాకోళమే. అయిపోయింది.. ఇంక వడ్డనే తరువాయి.'' అంది రాధ భోజనాలకన్ని ఏర్పాట్లు చేస్తూ.

తన అభిప్రాయాలతో రాధ ఏకీభవించడంతో అనంతమ్మకి కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు.

బూరెలు, బొబ్బట్లు, పులిహోరలతో అందరూ కడుపారా భోంచేశారు.

సాయంత్రం అందరూ కొత్త బట్టలు వేసుకున్నారు. రమ తను తెచ్చిన చీరల్నీ సుభద్రకి, రాధకి ఇచ్చింది.

సుభద్ర కూతురికి చిన్నగొలుసు చేయించాడు కృష్ణ. చెల్లెలికి, భార్యకి వదినకి ఉంగరాలు చేయించాడు.

''ఇప్పుడెందుకన్నయ్యా ఇవన్నీ.'' అంది సుభద్ర మొహమాటంగా.

''పోనీలే సుభా.. బావగారంత ప్రేమగా ఇస్తే కాదంటావెందుకు?'' అన్నాడు మోహన్. అతను సుభద్ర భర్త. మితభాషి.

అవి తీసుకుంది సుభద్ర.

సాయంత్రం పాపకి భోగిపళ్లు పోశారు. అందరికీ వాయినాలతో పాటు పంచదార చిలకలు కూడా పంచిపెట్టారు.

అనంతమ్మకి చూడ వేడుకగా ఉందా దృశ్యం. ఆమె కోరుకున్న సంబరం అంతా ఆమెకు దక్కింది.

మర్నాడు సంక్రాంతినాడు వేగం లేచి తల స్నానాలు చేసి సంక్రమణ పుణ్యకాలంలో తాత, తండ్రులకు తర్పణాలు వదిలారు బలరాం, కృష్ణలు.

చనిపోయిన భర్త మనసులో మెదిలాడు అనంతమ్మకి. ఆమె దుఃఖంతో కుమిలింది ఒక్కక్షణం.

గంగిరెద్దులవాళ్లు ''అయ్యగారికి దండం పెట్టు. అమ్మగారికి దండం పెట్టు..'' అంటూ సన్నాయి వాద్యంతో గుమ్మంలో కొచ్చారు. రాధ వారికి బియ్యం వేసి పాతబట్టలుంటే ఇచ్చింది. హరినామ సంకీర్తనతో విచ్చేసిన హరిదాసుకి కూడా బియ్యం, డబ్బులు ఇచ్చింది.

కొత్తబియ్యపు పాయసం, గారెలతో భోంచేశారందరూ.

సాయంత్రం అనంతమ్మ చేతులమీదుగా పనివాళ్లందరికీ బట్టలిప్పించి, ధాన్యం కొలిపించాడు కృష్ణ.

''అమ్మగోరూ.. బాబుగారు లేనిలోటు తీరుత్తన్నారు చినబాబుగోరు. అబ్బాయిగోరి సేతికెముక నేదనుకోండి'' ప్రశంసించారు వాళ్లు.

అనంతమ్మకి సంతోషభారంతో నోట మాట రాలేదు. పసుపు, కుంకుమలు పంచి పెట్టుకున్నారు సుభద్ర, రమ, రాధలు కలసి. ఆప్యాయంగా పలకరించే ఆ పల్లె పడుచుల మనస్సుల్లో నిర్మలత్వం రమను ఆకట్టుకుంది. మాలిన్యరహితమైన వారి హృదయ సౌందర్యం ఆమెను విచలితురాల్ని చేసింది. తను ఇంతవరకు అనుభవించని మధుర అనుభవాల్ని పొందుతోంది రమ. 'అందుకే అత్తయ్య తన పల్లె గురించి అలా పరితపించేవారు.' పల్లెలో ఆప్యాయంగా పలకరిస్తున్న అందరినీ చూసి అనుకుంది ఆమె.

కనుమ పండగ కూడా అంతులేని ఆనందంతో గడిచింది. ఆవులన్నింటికీ పసుపు, కుంకుమబొట్లు పెట్టి, సంక్రాంతినాటి గారెలను తినిపించారు రమ, రాధలు. తలారా స్నానాలు చేసి పిండి వంటలతో భోజనం చేశారారోజు కూడా. బలరాం, రమ, పిల్లలు బాగా ఎంజాయ్ చేశారీ పండగ ఆనందాన్ని.

ఆరాత్రి భోజనాలయినాక అందరినీ తన చుట్టూ కూర్చోబెట్టుకుంది అనంతమ్మ.

''ఒరేయ్ అబ్బాయిలూ.. ఈరోజు నాకెంతో ఆనందంగా ఉందిరా. నాన్నగారు పోయిన తరువాత మనందరం కలసి పండుగ చేసుకోవడం ఇదే తొలిసారి. క్రిందటేడు నేను ఎదుర్కొన్న చేదు అనుభవాల్ని తలచుకుంటే, మళ్లీ అవే ఈ పండగకి పునరావృతం అవుతాయేమోనని ఎంతో భయపడ్డాను. అంటే పట్నం వెళ్లిన నాకు లోటు ఏదో జరిగిందని కాదు.. కాని పుట్టి బుద్ధెరిగాక ఈ పల్లెలో తప్ప వేరెక్కడా పట్టుమని పదిరోజులు కూడా గడపలేదు. అందునా ఈ పండగ రోజుల్లో పట్నంలో చిక్కడిపోవడం నాకు చాలా బాధనిపించింది.

పండగంటే అందరం కలసి ఒక్కచోట వండుకుని తినటం ఒక్కటే కాదు. ఉద్యోగరీత్యా దూరతీరాలకు వెళ్లిపోయిన అన్నదమ్ములు.. పెళ్లిళ్లయినాక పరాయి ఇల్లకి వెళ్లిపోయిన ఆడపడుచులు అందరూ ఒకచోట సమావేశమయ్యి తమ సంతోషాన్ని, మధురానుభూతుల్ని ఒకరితో ఒకరు పంచుకోవటం. పండగలు మనిషికోసం జరుపుకొనేవి కాదు నా దృష్టిలో. రకరకాల సమస్యలతో అతలాకుతలమైన, కల్లోలితమైన మనస్సులకి స్వాంతన చేకూర్చడానికి. అందుకే మనసుకొక పండగ రావాలంటాను నేను.

ఈ ఏడాది భగవత్ కటాక్షం వలన అందరం ఒకచోట చేరగలిగాం. క్రిందటేడు కల్లోలం సృష్టించిన ప్రకృతి ఈఏడు అనుకూలించింది. పంటలు బాగా పండాయి. పుడమి తల్లికి పచ్చని పంటలు ఆనందాన్నిస్తే.. కన్నత

ల్లికి.. పచ్చగా కళకళలాడే సంతానం ఆనందాన్ని కలిగిస్తారు.''

ఆయాసం వచ్చి ఆగింది అనంతమ్మ. ఆమె గుండెల మీద అరచేత్తో మృదువుగా రాసింది సుభద్ర.

''పోనీలెండి అత్తయ్యా.. మీకోరిక నెరవేరింది. మీరు మా ఇంటిదగ్గరున్నప్పుడు ఎందుకలా విషాదంగా ఉండేవారో నాకప్పుడర్థమవలేదు. నేనేం లోటు చేశానా అనుకునేదాన్ని. కాని మీ ఆంతరంగికమైన వ్యధ నాకు ఇప్పుడు అవగతం అవుతోంది!'' రమ అంది అత్తగారిని అనునయిస్తూ.

''నాదో కోరిక తీరుస్తారా..'' అడిగింది అనంతమ్మ.

''ఏంటమ్మా..'' కోరస్‌గా అడిగారందరూ.

''ఏంలేదర్రా. నేనున్నా.. లేకున్నా.. ఈ సంక్రాంతి పండగ మాత్రం అందరూ.. ఒకేచోట కలసి ఉంటామని నాకు మాటియ్యండి. ఒకవేళ నేనుపోతే నా తద్దినం కూడా పండగలాగే జరుపుకోండి. అదే నాకు ఆనందం!'' అనంతమ్మ కన్నులవెంట అశ్రుధారలు– అవి ఆనందంతో వచ్చినవి.

''ఏంటమ్మా ఆ మాటలు. అయినా ఏంటీ అప్పగింతలు!'' అన్నారు కొడుకులు.

''అప్పగింతలు కాదురా.. ఆశ. మీరందరూ కలిసి ఏడాదికొకసారయినా కలసి సంతోషంగా ఉండాలని నా తల్లి మనసు ఆకాంక్షిస్తోంది. నా ప్రాణం ఈ క్షణాన పోయినా నాకు ఆనందమే.'' అంది ఆనంద భాష్పాలు కళ్ల నుండి జాలువారుతుండగా.

''అంతమాటనకండి.. అత్తయ్యా..'' అంటూ కోడళ్లు వారించారు ఆదుర్దాగా.

''అంటే ఏంరా.. పెద్దదాన్నయిపోయాను. మిమ్మల్నందరినీ ఒక్కచోట కళ్లారా చూశాను. ఇంక నేనేమయిపోతేనేం'' అంది అనంతమ్మ వారి గాబరాను గమనించి.

''ప్రొద్దుపోయింది. అందరూ పోయి పడుక్కోండి!'' అంది మళ్లీ అనంతమ్మే. ఎవరి గదుల్లోకి వారు వెళ్లిపోయి పడుక్కున్నారందరూ.

నిద్రలో అనంతమ్మకో కల.. సుందర్రావుగారు.. స్వర్గంలో పూలతేరు మీద ఊరేగుతూ కనిపించారా స్వప్నంలో.

''అనంతం నీకిప్పుడు తృప్తిగా ఉందా. ఆ నగర జీవన కృత్రిమత్వంలో ఇమడలేని నీకు.. ఇప్పుడు శాంతగా ఉందా.. నీ కోరిక ప్రకారం నీ మనసుతీరగా అందరూ కలిసి ఒకచోట పండగ జరుపుకున్నారు కదా.'' ఇంకా నీకక్కడేం పనే.. నాకిక్కడ ఒంటరిగా ఉండాలని లేదు. నువ్వు ఇక్కడికి వచ్చేయవే!'' అన్నారు ఆయన.

''నేనా.. ఇంకా పిల్లలందరూ చిన్నవాళ్లు. వాళ్ల పెళ్లిళ్లు పేరంటాలు కూడా చూసి వస్తాను'' కలలోనే అనంతమ్మ సమాధానం.

''ఇంకా ఎందుకే ఆశ. ఏ బంధాలు ఎప్పుడు తెగిపోతాయో చెప్పలేని రోజులివి. మనపట్ల వాళ్లు గౌరవం చూపెట్టినప్పుడే వారి నుండి మనం వీడ్కోలు తీసుకోవాలి!''

''బాగుంది.. భగవంతుడెన్నాళ్లు ఆయుర్దాయం ఇచ్చాడో.. అన్నాళ్లూ బ్రతకద్దూ. మనిష్టమా!'' అంది అనంతమ్మ.

''నీ ఇష్టం. నీ సంగతే తీసుకో.. క్రిందటేడాది నువ్వు నీ మనసుకి నచ్చిన విధంగా పండగ జరుపుకుందికి ఎంత తాపత్రయ పడ్డావో నీకు జ్ఞాపకం లేదా. రాధ మొదట్నుంచీ నీ అడుగుజాడలలో నడిచిన మనిషి కాబట్టి.. నిస్వార్థం చేసుకుని ఈ ఏడాది నీ మనసు కనుగుణంగా పండగ జరిపించింది. ఏమో ఎవరి అంతరంగాలు ఏవిధంగా మార్పు చెందుతాయో.''

''పండగని పండగగా భావించినంతకాలం ఫరవాలేదు. కాని పండగని కూడా దండగనుకొనే రోజులొచ్చాయి. అలాగే మనల్ని కూడా వాళ్లు బాధ్యత అనుకున్నంతకాలం బాధలేదు. కాని వారు మనల్ని బరువుగా తలిస్తే?! అందుకేనే నిన్ను రమ్మంటున్నది. మనం వాళ్లతో కలిపి గడిపిన రోజుల్ని వాళ్లు ఒక పండగలా తలుచుకొని, గడుపుకోవాలంటే నువ్వు కూడా నా దగ్గరికి రాక తప్పదు. తరువాత నీ ఇష్టం'' మాయమయ్యారు సుందర్రావుగారు.

ఒక్క ఉదుటున మేల్కొంది అనంతమ్మ.

''నిజమే.. ఆ మారాజు చెప్పినదల్లా అక్షర సత్యం. కోరిన పండగని కళ్లారా చూసింది. ఇంకా తనేం అనుభవించాలి. ఆయన దగ్గరికి చేరితే ఏం!''

ఆమె గుండెల్లో సన్నగా నొప్పి.. అది చిన్నగా ప్రారంభమై.. భరించలేని లోటుగా మారింది. నోట్లోంచి మాట పెగల్లేదు.

కాస్సేపు కొట్టుకుని కొట్టుకుని అనంతమ్మ ప్రాణాలు అనంత వాయువుల్లో లీనమయ్యాయి.

కోరిక తీరిన తృప్తితో వేగమే ప్రాణాలు వదిలి కట్టెలా బిగుసుకుపోయిందామె. తెల్లవారిన తరువాత జీవరహితమైన ఆమె శరీరాన్ని చూసి ఘొల్లుమన్నారందరూ.

''ఏటి బాబూ.. ఏటిది.. ఆయమ్మ అదురుట్టమంతురాలు.. అందరు బిడ్డలూ ఇంటి కాడుండగానే పేనాలొగ్గేసినాది. పైగా పండగ దినాలు.'' అన్నాడు రంగడు. వాడికి అనంతమ్మ మాతృ సమానురాలు.

''నిజమే బావగారూ.. అత్తయ్య పుణ్యాత్మురాలు. ఆమె కోరుకున్నట్లుగా ఆమె కార్యాన్ని ఒక పండగలా నిర్వహించండి.'' మోహన్ ఓదార్చాడు.

అతని సలహాని పాటించి, ఆమె ఆత్మకి శాంతిని చేకూర్చారు అన్నదమ్ములిద్దరూ. ఈ దృశ్యాన్ని పైనుండి తిలకించిన అనంతమ్మ ఆత్మ ఎంతో సంతోషించింది.

★

## పెద్ద లాండింగ్ ఓడ



భారతదేశంలో అతి పెద్ద లాండింగ్ ఓడ ఐఎన్ఎస్ మగార్. 30 కోట్ల రూపాయల ఖర్చుతో నీటిమీద, నేలమీద ఉపయోగించుకునేటట్టు నిర్మింపబడింది. ఇది సైన్యాన్ని ఎక్కడ కావాలంటే అక్కడ సునాయాసంగా దింపుతుంది. దీని ఆధునాతన సౌకర్యాలలో క్లోజ్డ్ సర్క్యూట్ టీవీ ఒకటి.

## ఇస్తాంబుల్ రాజమందిరం

ఇస్తాంబుల్‌లో తురుష్క చక్రవర్తులకు చెందిన టోప్‌కాపీ పాత రాజమందిరంలో పదిహేడు గ్రంథాలయాలు, ఇర్వై రెండు జలయంత్రాలు, 353 పడక గదులు, చావడులు, పన్నెండు మసీదులు, పన్నెండు స్నానాల గదులు, రెండు మందుల దుకాణాలు, రెండు హాస్పిటళ్ళు, ఐదు స్కూళ్ళు, ఐదు డార్మిటరీలు వుంటాయట.

## మొదటి క్రిస్మస్ ట్రీ

మొట్టమొదటి 'క్రిస్మస్ ట్రీ'ని ప్రిన్స్ ఆల్బర్ట్ ప్రవేశపెట్టాడు. క్రిస్మస్ పండుగ రోజుల్లో దీపాలతో అలంకరింపబడిన క్రిస్మస్ ట్రీని ప్రపంచం అంతటా క్రిస్టియనులు ఇళ్ళలో పెట్టుకుంటారు. అనేక సంవత్సరాల నుంచీ 'ఫిర్' చెట్టును జర్మనీ, ఆస్ట్రియా, యూరప్ దేశాల్లో క్రిస్మస్ చెట్టుగా కొనియాడుతారు. క్రీస్తు పుట్టిన రాత్రి ప్రపంచంలో చెట్లన్నీ పువ్వులు తొడిగాయని క్రిస్టియనుల విశ్వాసం.

1841లో ఆల్బర్ట్ యువరాజు ఇంగ్లండులో క్రిస్మస్ ట్రీ ని ప్రవేశపెట్టాడు. విండ్సర్ కాసిల్‌లో పిల్లల క్రిస్టమస్ వేడుకలలో దీనిని ప్రదర్శించారు. ఆనాటి నుంచి 'క్రిస్మస్ ట్రీ'ని ప్రపంచంలో ప్రతి ఇంట్లోను క్రిస్టియనులు పెట్టుకోడం ప్రారంభించారు.

- జి.శారద

